సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా


శనివారం । 22 । జూలై । 2023

I



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి.



టమాట కిలో రూ.107

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.107 పలికింది. కనిష్టం రూ.55, సరాసరి రూ.96 చొప్పున క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.2°/21.4°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. నైరుతి దిశగా గాలులు గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

ఎవరెన్ని యాత్రలు చేసినా.. జగన్ జైత్రయాత్ర ఆపలేరు

- హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్



మట్లాడుతున్న గోరంట్లమాధవ్

మడకశిర: ఎవరెన్ని యాత్రలు చేసినా వైఎస్ జగన్ జైత్రయాత్ర ఆగదని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ అన్నారు. శుక్రవారం ఆయన మడకశిర ఆర్అండ్‌బీ బంగ్లా ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ''ఒకరు తేలుకుట్టిన దొంగ...మరొకరు కల్లు తాగిన కోతి'' అంటూ నారా లోకేశ్, పవన్ కల్యాణ్‌లను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. లోకేశ్ యువగళం పాదయాత్ర చేసినా, పవన్‌కల్యాణ్ వారాహి యాత్ర చేసినా, చివరకు టీడీపీ అధినేత చంద్రబాబు కాశీయాత్ర చేసినా వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ జైత్రయాత్రను ఆపలేరన్నారురు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని దీమా వ్యక్తం చేశారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని వ్యక్తి లోకేశ్ అని విమర్శించారు. బీజేపీ, జనసేన, టీడీపీ కలిసివచ్చినా, విడివిడిగా వచ్చినా భయపడే ప్రసక్తే లేదన్నారు. తాము సింగిల్‌గానే వస్తామన్నారు.

రైస్ కార్డులు సిద్ధం

- ఆగస్టు మొదటి వారంలో పంపిణీకి చర్యలు



సిద్ధమైన రేషన్ కార్డులు

పుట్టపర్తి అర్బన్: రైస్ కార్డుకోసం దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గత ఆరు నెలలుగా అందిన దరఖాస్తులతో పాటు 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి రైస్ కార్డులు మంజూరు చేసింది. ఇప్పటికే వీటిని ఆయా మండల కేంద్రాలకు పంపింది. లబ్ధిదారుల వివరాలను ఆయా సచివాలయాల్లోనే ప్రింటింగ్ చేసి అందజేసేలా చర్యలు చేపట్టింది. పూర్తిగా సిద్ధం చేసిన కార్డులను ఆగస్టు మొదటి వారంలో లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి తెలిపారు. రైస్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో వేరు పడిన కుటుంబాలు, నూతనంగా పెళ్లి చేసుకున్న జంటలు కొత్తగా దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన వివరించారు. ఈ క్రమంలో గత ఆరు నెలలుగా 1,420 మంది బియ్యంకార్డుకు దరఖాస్తులు అందించారని, అలాగే 'జగనన్న సురక్ష'లో మరో 812 మంది దరఖాస్తులు చేసినట్లు ఆయన డీఎస్‌ఓ వెల్లడించారు. ప్రస్తుతం జిల్లాలో 5,60,914 రైస్ కార్డులుండగా, 349 ఎండీయూ వాహనాల ద్వారా సుమారు 8,700 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. కార్డుదారులకు బియ్యంతో పాటు చక్కెర, కంది బేడలు, రాగులు, పట్టణ ప్రాంతాల్లో గోధుమ పిండి పంపిణీ చేస్తున్నామన్నారు.

ప్రారంభమైన ఇంటింటి సర్వే



పెదపల్లిలో ఇంటింటి సర్వే చేస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: తప్పుల్లేని ఓటరు జాబితా తయారీలో భాగంగా శుక్రవారం నుంచి రెవెన్యూ అధికారులు, బీఎల్‌ఓలు జిల్లాలో ఇంటింటి సర్వే ప్రారంభించారు. జిల్లాలోని 32 మండలాల్లోని 1,555 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఎన్నికల అధికారులు, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి కుటుంబ యజమానులతో మాట్లాడి ఓటరు జాబితాలో నమోదు, తొలగింపులు, సవరణ వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. అప్పటికప్పుడే వివరాల నమోదుతోపాటు ఓటరు ఇంటిని సందర్శించినట్లు ఫొటోక్యాప్చర్ చేస్తున్నారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే యువతీ యువకుల నుంచి ఫాం-6 తీసుకుని కొత్త ఓటరుగా నమోదు చేస్తున్నారు. వయస్సు ధ్రువీకరణకు ఆధార్ కార్డుతో పాటు పదో తరగతి మార్కుల జాబితా తీసుకుంటున్నారు. ఇక మృతులు ఓట్లతో పాటు, డబుల్ ఎంట్రీలను తొలగించేందుకు ఫాం-7లో నమోదు చేసి సర్వే అనంతరం సదరు ఓట్లు తొలగించేలా చర్యలు చేపట్టారు. సవరణలు, నియోజకవర్గంలోనే ఇతర ప్రాంతాలకు ఓటు బదిలీ కోసం ఫాం-8 స్వీకరిస్తున్నారు. ఇంటింటి సర్వే కోసం ఇప్పటికే కలెక్టర్ అఖిల పక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రతి రాజకీయ పార్టీ నుంచి ఒక ఏజెంటు పాల్గొనేలా చూడాలన్నారు.

నేతన్నల జీవితాల్లో వెలుగు

- అర్హులందరికీ 'నేతన్న నేస్తం' అందేలా చర్యలు
- రాష్ట్ర కార్మిక శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం
- 'వైఎస్సార్ నేతన్న నేస్తం' లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేత
- జిల్లాలో 16,049 మందికి లబ్ధి కలిగినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు వెల్లడి



మడకశిరలో చేనేత కార్మికులకు మెగా చెక్కును అందిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్యే తిప్పేస్వామి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు

మడకశిర: మగ్గాన్ని నమ్ముకుని జీవించే నేతన్నల జీవితాల్లో వెలుగు నింపేందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర కార్మిక శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు. 'వైఎస్సార్ నేతన్న నేస్తం' ఐదో ఏడాదికి సంబంధించిన నిధులను శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి జిల్లా వెంకటగిరి బహిరంగ సభలో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. జిల్లా స్థాయి కార్యక్రమాన్ని మడకశిరలోని టీటీడీ కల్యాణ మంటపంలో నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి తదితరులు జిల్లాలోని 16,049 మంది లబ్ధిదారులకు సంబంధించిన రూ.38,51,76,00 మెగా చెక్కును అందించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు మాట్లాడుతూ.. సీఎం జగన్ మగ్గానికి మహర్దశ తీసుకొచ్చారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని నేతన్నల జీవితాల్లో వెలుగు నింపుతున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం 'వైఎస్సార్ నేతన్న నేస్తం' కింద సొంత మగ్గం ఉండి అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికీ ఏటా రూ. 24 వేల చొప్పున జమ చేస్తున్నారన్నారు. అలాగే చేనేతలకు ప్రత్యేకంగా ఫించన్ అందించి ఆదుకుంటున్నారన్నారు. ఇక రైతు భరోసా, ఆసరా, చేయూత, అమ్మఒడి, పంటల బీమా, విద్యా దీవెన, తదితర పథకాలన్నీ నేతన్నలకు వర్తింపజేస్తూ చేనేతల పక్షపాతిగా మారారన్నారు. 'వైఎస్సార్ నేతన్న నేస్తం' ద్వారా అందిన నిధులను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు.

నేతన్నల ఖాతాల్లోకి రూ.38.51 కోట్లు

కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ... 'వైఎస్సార్ నేతన్న నేస్తం' వరుసగా ఐదో ఏడాది అమలు చేస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా ఈసారి రాష్ట్రంలోని 80,686 మందికి రూ.193.64 కోట్ల లబ్ధి కలిగిందన్నారు. జిల్లాకు సంబంధించి 16,049 మందికి 'నేతన్న నేస్తం' ద్వారా లబ్ధి కలిగిందన్నారు. ఇందులో ధర్మవరం నియోజవర్గంలో 12,747 మందికి, హిందూపురంలో 735 మందికి, కదిరిలో 499, మడకశిరలో 49, పెనుకొండలో 796, పుట్టపర్తిలో 421, రాప్తాడు నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన 578 మందికి లబ్ధి కలిగిందన్నారు. ఒక్కొక్కరికి రూ. 24వేల చొప్పున రూ.38.51 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. చేనేత కార్మికులు ఈఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జాయింట్ కలెక్టర్ చేతన్, సబ్ కలెక్టర్ కార్తిక్, స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి, ఎమ్మెల్సీ మంగమ్మ, సీపీఓ విజయకుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అవుటాల రమణారెడ్డి, చేనేత, జౌళిశాఖ ఏడీ రమేష్‌బాబు పాల్గొన్నారు.

నాకు రూ.1.20 లక్షల లబ్ధి కలిగింది



వైఎస్సార్ నేతన్న నేస్తం కింద ఇప్పటి వరకు నాకు రూ.1.20 లక్షల లబ్ధి కలిగింది. ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక తోడ్పాటుతో నాలాంటి వారెందరో బాగుపడ్డారు. ప్రభుత్వం అమలు చేసిన ఇతర సంక్షేమ పథకాల వల్ల నా కుటుంబం పూర్తి స్థాయిలో లబ్ధి పొందింది. ఆర్థికంగా నిలదొక్కుకున్నాం. మాకు అండగా నిలిచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటా.

– ప్యారు, చేనేత కార్మికుడు, ముద్దిరెడ్డిపల్లి

ఆర్థికంగా నిలదొక్కుకున్నా



గతంలో ఏ ప్రభుత్వమూ మా చేనేత కార్మికుల సంక్షేమం గురించి పట్టించుకోలేదు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే మాకోసం 'వైఎస్సార్ నేతన్న నేస్తం' అమలు చేశారు. ఏటా రూ.24 వేల చొప్పున నాకు ఇప్పటి వరకూ రూ.1.20 లక్షల లబ్ధి కలిగింది. ఈ పథకం వల్లే నేను ఆర్థికంగా నిలదొక్కుకుని హాయిగా జీవిస్తున్నా.

– రామకృష్ణ ,ఆర్ అనంతపురం, మడకశిర మండలం

జగన్ మేలు మరచిపోం



చేనేత కార్మికులను ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుంది. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం మమ్మల్ని అన్ని రకాలుగా ఆదుకుంటున్నారు. ఆర్థిక సాయం అందించి తమ కుటుంబాలకు అండగా నిలిచారు. జగనన్న చేసిన మేలు ఎప్పటికీ మరువం. ఆయనకు అండగా ఉంటాం.

– రామప్ప, చేనేత కార్మికుడు, ముద్దిరెడ్డిపల్లి, హిందూపురం

అవగాహన లేని వ్యక్తి నారా లోకేష్

- మంత్రి గుమ్మనూరు జయరాం ధ్వజం



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి జయరాం

మడకశిర: రాజకీయాల్లో అవగాహన లేని వ్యక్తి నారా లోకేష్ అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం విమర్శించారు. శుక్రవారం ఆయన మడకశిరలోని టీటీడీ కల్యాణ మంటపంలో విలేకరులతో మాట్లాడారు. నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్రను ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. అసలు పాదయాత్ర రాష్ట్రంలో ఎక్కడ జరుగుతోందో కూడా ప్రజలకు తెలియదన్నారు. ప్రజా క్షేత్రంలో లోకేష్ సర్పంచుగా కూడా గెలవలేదని విమర్శించారు. అలాంటి వ్యక్తి విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఏం చేసినా ప్రజలు పట్టించుకోక పోవడంతో ఎలాగైనా వారిని ఆకట్టుకోవాలనే ఉద్దేశంతో చంద్రబాబు తమ ప్రభుత్వ పథకాలను కాపీ కొడుతున్నారని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఇచ్చిన హామీలను నాలుగేళ్లలోనే 99 శాతం నెరవేర్చారని తెలిపారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాల ప్రజలను కూడా ఆకర్షిస్తున్నాయని, తాము కూడా ఆంధ్రప్రదేశ్‌లో ఉండి ఉంటే బాగుండేదని అనుకుంటున్నారని చెప్పారు. జగనన్న సురక్ష పథకం దేశంలోనే హైలెట్‌గా నిలిచిందని తెలిపారు. 'జగనన్న సురక్ష'తో వలంటీర్లే ఇళ్ల వద్దకు వచ్చి ప్రజలకు కావాల్సిన 11 ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేస్తున్నారన్నారు. అలాగే అర్హత ఉండి పథకాలు అందుకోలేని వారు ఎవరైనా ఉంటే వెంటనే పథకం వర్తింపజేస్తూ ఆ కుటుంబాల్లో ఆనందం నింపుతున్నారన్నారు. సమావేశంలో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, పలువురు ప్రజానిధులు పాల్గొన్నారు.

స్పెషల్ బ్రాంచ్ కీలకంగా పనిచేయాలి

- ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి



స్పెషల్‌బ్రాంచ్ సిబ్బందికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: ముందస్తు సమాచారంతోనే నేరాల నివారణ సాధ్యమవుతుందని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన స్పెషల్ బ్రాంచ్ విభాగం కీలకంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. శుక్రవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన వారికి రివార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పోలీసు శాఖలో స్పెషల్ బ్రాంచ్ చాలా కీలకమైనదన్నారు. ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండి విధులు నిర్వర్తించాలన్నారు. ముందస్తు సమాచారం చేరవేస్తూ నేరాలను నివారించడంతో పాటు శాంతిభద్రతలను పరిరక్షించాలన్నారు. ఇక గంజాయి, మట్కా, బెట్టింగ్‌పై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. అలాగే జిల్లాలో పొలికల్ గ్రూప్‌లపై నిఘా పెంచాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, సరైన సమాచారం సకాలంలో ఇవ్వకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ రవీంద్రారెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: సివిల్ సర్వీసెస్, గ్రూప్-1, గ్రూప్-2 పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్ రావు ఓ ప్రకటనలో కోరారు. విశాఖపట్నంలో సివిల్ సర్వీసెస్, విజయవాడలో గ్రూప్-1, తిరుపతిలో గ్రూప్-2కు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వార్షికాదాయం రూ.6 లక్షల లోపు ఉండడంతో పాటు ఏపీకి చెందిన వారు శిక్షణకు అర్హులని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు htt pr://apstdc.apcfss.in లో ఆగస్టు ఐదో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆ పైశాచకుడిని కఠినంగా శిక్షించాలి

- 'బాలికపై మారుతండ్రి ఘాతుకంపై స్పందించిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్
- కేసు సుమోటోగా స్వీకరిస్తున్నట్లు వెల్లడి...కఠిన శిక్ష పడేలా కేసు నమోదు చేయాలని ఆదేశం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికకు పరామర్శ..రక్షణ కల్పించాలని సూచన



చిన్నారితో మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు

హిందూపురం టౌన్: ఆరేళ్ల చిన్నారికి ఇనుప చువ్వలతో వాతలు పెట్టిన పైశాచకుడికి కఠిన శిక్ష పడేలా కేసు నమోదు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఆదేశించారు. మారుతండ్రి మణికంఠ పైశాచిక చర్యలతో తీవ్రంగా గాయపడి హిందూపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి చంద్రికను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం, పద్మావతి, ఆదిలక్ష్మీ, త్రిపర్ణ శుక్రవారం పరామర్శించారు. జరిగిన దాష్టీకాన్ని చిన్నారిని అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న రూరల్ సీఐ కృష్ణారెడ్డిని అడిగి కేసు వివరాలు తెలుసుకున్నారు. ఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారని ఆరా తీశారు. ఆడియో, వీడియో ద్వారా చిన్నారి వాంగ్మూలం తీసుకుని మరిన్ని సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కేసును బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సుమోటోగా స్వీకరిస్తోందని, దీనిపై నివేదికను అందించాలని ఆదేశించారు. అనంతరం చిన్నారి ఆరోగ్య పరిస్థితి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్‌కుమార్‌తో ఆరా తీశారు. అలాగే ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారితో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. చిన్నారిని ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సీడీపీఓను పర్యవేక్షణలో ఉంచాలని ఆదేశించారు. వివరాలను ఎప్పటికప్పుడు తమకు తెలియజేయాలన్నారు. అనంతరం కమిషన్ సభ్యులు గొండు సీతారాం మీడియాతో మాట్లాడారు. ఈ ఘటనకు చాలా చింతిస్తున్నామన్నారు. నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి, ఇందుకు కారణమైన వారిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని ఆదేశించామన్నారు. దీనిపై జిల్లా పోలీసు అధికారులతో ఇప్పటికే మాట్లాడామన్నారు. తల్లిదండ్రులు చిన్నారులపై ఇలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలను పోషించలేని వారు పిల్లలను ప్రభుత్వ వ్యవస్థలకు అప్పజెప్పాలన్నారు. సభ్య సమాజం తలదించుకునే ఇలాంటి పనులను కమిషన్ తీవ్రంగా పరిగణిస్తుందని, దోషులకు కఠిన శిక్షపడేలా చూస్తుందన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ రెడ్డిరమణమ్మ, సూపర్‌వైజర్లు శాంతి, జయమ్మ, సరస్వతి, అనిత, డాక్టర్లు పాల్గొన్నారు.

అభివృద్ధికి కలిసి సాగుదాం

- మడకశిరను మరింత అభివృద్ధి చేయాలి
- అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితోనే సాధ్యం
- పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించాలి
- అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించం
- మడకశిర నియోజకవర్గ అభివృద్ధి సమీక్షలో మంత్రి గుమ్మనూరు



మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం, చిత్రంలో ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే తిప్పేస్వామి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ చేతన్ తదితరులు

మడకశిర: ''జిల్లా సరిహద్దులో ఉన్న మడకశిరను గత పాలకులు నిర్లక్ష్యం చేశారు. కానీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అన్ని విధాలా అభివృద్ధి చేస్తోంది. ఎమ్మెల్యే తిప్పేస్వామి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి...అన్ని రంగాల్లో ముందువరుసలో చేర్చేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఆయనకు అధికారులంతా సహకరించాలి. ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం సమష్టిగా ముందుకు సాగుతేనే అభివృద్ధి సాధ్యం'' అని రాష్ట్ర కార్మికశాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీటీడీ కల్యాణ మంటపంలో మడకశిర నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష సమావేశం జరిగింది. మంత్రి గుమ్మనూరు జయరాం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ చేతన్, సబ్ కలెక్టర్ కార్తీక్, జిల్లా వ్యవసాయ సలహా మండలి బోర్డు అధ్యక్షుడు రమణారెడ్డి, డీఆర్‌ఓ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఇప్పటి వరకూ చేపట్టిన అభివృద్ధి పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులపై అధికారులతో మంత్రి సమగ్రంగా సమీక్షించారు. అనంతరం మంత్రి గుమ్మనూరు మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు సమావేశంలో ప్రస్తావించిన సమస్యలన్నీ పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా పేదలందరికీ న్యాయం చేయాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం ఎంత ముఖ్యమో అవినీతి రహిత పాలన కూడా అంతే ముఖ్యమన్నారు. దీన్ని గుర్తించి అధికారులు పనిచేయాలన్నారు. సమీక్షలో ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుని నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే తిప్పేస్వామితో కలిసి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించడానికి అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని సూచించారు.

సీఎం ఆలోచనా విధానానికి అనుకూలంగా పనిచేయాలి

ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ... రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి జగనన్న కృషి చేస్తున్నారని, అధికారులంతా సీఎం ఆలోచనా విధానానికి అనుకూలంగా పని చేయాలన్నారు. అలాగే నిరుపేదలకు మేలు చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అర్హులమైనా తమకు పథకం అందలేదని ఫిర్యాదు ప్రజల నుంచి అందకూడదన్నారు.

పురోగతి సాధించాలి



కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ... మడకశిర నియోజకవర్గ అభివృద్ధిలో పురోగతి సాధించాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని సమస్యలన్నీ పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. మంత్రి, స్థానిక ఎమ్మెల్యే అందించిన సలహాలు, సూచనలపై పాటిస్తూ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. మడకశిర ప్రాంతంలోని అక్రమ లేఅవుట్‌లపై జిల్లా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ క్రమంలో వెంటనే క్షేత్రస్థాయిలో లేఅవుట్లను పరిశీలించి సబ్ కలెక్టర్‌కు వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఏ రాజకీయ పార్టీ ర్యాలీలోనూ పాల్గొనకూడదని ఈసీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రాధాన్యత భవన నిర్మాణ పనులను సెప్టెంబర్ 15వ తేదీలోపు పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, పర్యాటకశాఖ అతిథి గృహాన్ని ప్రారంభించాలని, అమరాపురంలో సబ్ మార్కెట్‌యార్డు ఏర్పాటుకు భూమిని సేకరించాలని, మడకశిర ఆస్పత్రి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే మున్సిపల్ భవన నిర్మాణానికి అవసరమైన భూమిని సేకరించాలని ఆదేశించారు. దళితుల స్మశాన వాటికలకు స్థలం లేదనే ఫిర్యాదులు రాకూడదన్నారు.

నియోజకవర్గ సమస్యలన్నీ పరిష్కరించాలి



ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి మాట్లాడుతూ... నియోజకవర్గంలోని సమస్యలన్నీ పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మడకశిర బైపాస్ కెనాల్ పనులు ప్రారంభించాలని, మడకశిర ప్రాంతంలో హంద్రీనీవా కాలువ పనులన్నీ పూర్తి చేసి అన్ని మండలాలకు కృష్ణా జలాలు అందించాలని కోరారు. ఆర్.అనంతపురం వద్ద ఏర్పాటు చేసిన లెదర్ పార్కును వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఇండోర్ స్టేడియం పనులను పూర్తి చేయాలని, పారిశ్రామికవాడలో పరిశ్రలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 50 సమస్యలను ఎమ్మెల్యే సమావేశంలో ప్రస్తావించి పరిష్కానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో సీపీఓ విజయకుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, పీఆర్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ రామాంజనేయులు, డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి, డీసీహెచ్ఎస్ ఎంటీ నాయక్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ చాంద్‌బాషా, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రషీద్‌ఖాన్, పౌరసరఫరాల శాఖ డీఎం అశ్వర్థనారాయణ నాయక్, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, డీఎస్‌ఓ వంశీకృష్ణ, పబ్లిక్ హెల్త్ డీఈ సతీష్‌రెడ్డి, పర్యాటక శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి, మున్సిపల్ ఏఈ మురళి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, డీఈలు, ఏఈలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలందించాలి

హిందూపురం టౌన్: ప్రజలకు ఉత్తమ సేవలందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణారెడ్డి, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్ వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లోని ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓలకు శిక్షణ కార్యక్రమం ముగిసింది. స్థానిక ఆస్పత్రిలోని సెమినార్ హాలులో డీపీఎంఓ చిన్న కుళ్లాయప్ప నాయక్ అధ్యక్షతన సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీఎంహెచ్‌ఓ, డీసీహెచ్ఎస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ రోహిల్ కుమార్, కాయకల్ప కేరళ బృందం సురేష్‌బాబు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం ఎంఎల్‌హెచ్‌పీలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అవసరం మేరకు పలు రకాల శిక్షణ అందిస్తోందన్నారు. వృత్తి పరంగా ఉన్నత శిఖరాలు అందుకోవడానికి మంచి అవకాశమని తెలిపారు. వృత్తిపరంగా మరింత మేధోసంపన్నులై ప్రజారోగ్య పరిరక్షణలో ముఖ్య భూమిక పోషించాలన్నారు. మాతాశిశు మరణాల నివారణకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుఖప్రసవంపై గర్భిణులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. అనంతరం శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఎంఎల్‌హెచ్‌పీల నుంచి అడిగి తెలుసుకున్నారు. సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో శిక్షకులు అమరప్రియ, నవితశ్రీ, రాధిక, డీపీఎం రెడ్డికుమార్‌రెడ్డి, డీపీఎం రమణ, సీహెచ్‌ఓ వన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌ఓలతో డీఎంహెచ్‌ఓ, డీసీహెచ్ఎస్

పండుగలా జగనన్న సురక్ష

- ప్రజల నుంచి విశేష స్పందన
- ప్రతి ఇంటినీ జల్లెడు పడుతున్న వలంటీర్లు
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



వెంగళమ్మచెరువులో 'జగనన్న సురక్ష' సర్వే నిర్వహిస్తున్న వలంటీర్

పుట్టపర్తి అర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమం జిల్లాలో పండుగలా సాగుతోంది. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సర్టిఫికెట్ ఉచితంగా అందుతుండడంతో పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు ప్రత్యేక దృష్టి సారించడంతో మండల స్థాయి ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓ, తహసీల్దార్లతో ఏర్పాటు చేసిన మండల కమిటీలు పకడ్బందీగా కార్యక్రమం కొనసాగిస్తున్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటా సర్వే చేస్తూ రోజూ ఏదో ఒక సచివాలయం పరిధిలో 'జగనన్న సురక్ష' సభలు నిర్వహిస్తున్నారు. సర్టిఫికెట్లు అందిస్తున్నారు.

రాష్ట్రంలోనే 5వ స్థానం

జగనన్న సురక్ష అమలులో రాష్ట్రంలోనే శ్రీసత్యసాయి జిల్లా 5వ స్థానాన్ని దక్కించుకోవడం విశేషం. జిల్లాలో 32 మండలాలు, 6 మున్సిపాలిటీలు ఉన్నాయి. 'జగనన్న సురక్ష'లో భాగంగా 38 కమిటీలు పనిచేస్తున్నాయి. కార్యక్రమం ప్రారంభమై 20 రోజులు పూర్తయింది. ఇప్పటి వరకూ 4,05,300 కుటుంబాలను సర్వే చేయగా 3.51 లక్షల మందికి సేవా సర్టిఫికెట్లు అందజేశారు. సరైన ఆధారాలు అందగానే మరో 28, 308 సర్టిఫికెట్లకు మంజూరు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. గడువు ఇంకా 10 రోజులు ఉందని, ఆ లోపు ప్రతి కుటుంబాన్నీ సర్వే చేస్తామని వారు పేర్కొన్నారు. 'జగనన్న సురక్ష సర్వే'లో సేకరిస్తున్న వివరాలు 10 ఏళ్ల వరకూ ఉపయోగకరంగా ఉంటాయని అధికారులు చెబుతున్నారు. 2011 లెక్కల ప్రకారం జిల్లాలో 4.7 లక్షల కుటుంబాలు ఉండగా, నేటికి చాలా మేర పెరిగిన పరిస్థితి. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి కుటుంబాన్నీ సర్వే చేస్తున్నట్లు వివరించారు.

ఈనెల 15 వరకూ అందించిన సేవలిలా..	
ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు	1,27,899
ఇన్‌కం సర్టిఫికెట్లు	1,30,776
మొబైల్ నంబర్‌కు ఆధార్ లింకు	3908
రేషన్‌కార్డు విభజన	809
హౌస్ హోల్డ్ విభజన	305
ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు	180
జనన ధ్రువీకరణ పత్రాలు	181
డెత్ సర్టిఫికెట్లు	13
వివాహ ధ్రువీకరణ పత్రాలు	32
మ్యుటేషన్లు	94
కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు	37

ఉచితంగా 12 పత్రాలు అందుకున్నాం



మా కుటుంబం 12 సేవా సర్టిఫికెట్లు తీసుకుంది. చాలా సంతోషంగా ఉంది. గతంలో ఒక సర్టిఫికెట్ కావాలంటే మీసేవకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి ఉండేది. మళ్లీ మండల కేంద్రానికి వెళ్లి సంబంధిత అధికారి వద్ద సమర్పించాల్సిన పరిస్థితి. నేడు ఆ బాధలన్నీ తప్పాయి. ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా సర్టిఫికెట్లు అందుకున్నాం. – అశ్విని, వెంకటగారిపల్లి

చాలా మంచి కార్యక్రమం



'జగనన్న సురక్ష' చాలా మంచి కార్యక్రమం. వలంటీర్లు వచ్చి అడిగి మరీ సేవా సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. నా పిల్లల కోసం 6 సర్టిఫికెట్లు తీసుకున్నాను. ఆధార్ లింక్ చేయించుకున్నా. రెవెన్యూ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లా. త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. – వెంకటరాముడు, పుట్టపర్తి

సద్వినియోగం చేసుకోవాలి



ఏ సేవా సర్టిఫికెట్ కావాలన్నా వాటికి అవసరమైన ధ్రువ పత్రాలను వలంటీర్‌కు, సచివాలయ ఉద్యోగికి అందజేయాలి. దీంతో త్వరగా సర్టిఫికెట్లు జారీ అవుతాయి. 11 రకాల సేవా సర్టిఫికెట్లు ఉచితంగానే అందిస్తాం. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. – అరుణ్‌బాబు, జిల్లా కలెక్టర్

విద్యా వ్యవస్థలో హెచ్‌ఎంల పాత్ర కీలకం

- సీమాట్ డైరెక్టర్ మస్తానయ్య



క్యాంప్ ఫైర్‌ను ప్రారంభిస్తున్న సీమాట్ డైరెక్టర్ మస్తానయ్య

రాప్తాడురూరల్: విద్యా వ్యవస్థలో ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకమని సీమాట్ డైరెక్టర్ మస్తానయ్య తెలిపారు. 'లీడర్ షిప్' అంశంపై అనంతపురం నగర శివారులోని టీటీడీసీ కేంద్రంలో ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు జరుగుతున్న రీజనల్ స్థాయి శిక్షణలో శుక్రవారం రాత్రి క్యాంప్ ఫైర్, మ్యూజికల్ నైట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మస్తానయ్య మాట్లాడుతూ విద్యా వ్యవస్థ సమర్థంగా ఉండాలంటే హెచ్‌ఎంలు అద్భుతమైన నాయకత్వ లక్షణాలు కల్గి ఉండాలన్నారు. దేశంలో విద్యా సంస్థల సమర్థ నిర్వహణకు సంబంధించిన నాయకత్వ శిక్షణలు ఇచ్చే సంస్థలు కేవలం పది రాష్ట్రాల్లోనే ఉన్నాయన్నారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో ప్రభుత్వం విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో హెచ్‌ఎంలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోనే విద్యాశిక్షణలో ఉత్తమ ఆచరణ పద్ధతులు కల్గిన స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ సహజంగా కొన్ని నాయకత్వ లక్షణాలు కల్గి ఉంటారని తెలిపారు. డీఈఓ సాయిరామ్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ప్రధానోపాధ్యాయులు తీసుకుంటున్న నాయకత్వ శిక్షణ సశాస్త్రీయంగా ఉందన్నారు. వారిని ఉత్తమ హెచ్‌ఎంలుగా తీర్చిదిద్దుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డీఈఓ సాయిరామ్ ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి. దాండియా, నాటికలు, హాస్యవల్లరిలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డెప్యూటీ డీఈఓలు పద్మప్రియ, శంకరప్రసాద్, సీమాట్ ప్రొఫెసర్ మహేశ్వరరెడ్డి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



డీఈఓకి సమస్యలను వివరిస్తున్న ఉపాధ్యాయులు

ప్రశాంతి నిలయం: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ.రమణారెడ్డి కోరారు. ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయులు కొత్తచెరువులోని డీఈఓ కార్యాలయంలో డీఈఓ మీనాక్షికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వశిక్ష అభియాన్, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. 2023లో బదిలీ అయినా రిలీవ్ కాని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలన్నారు. ఆ స్థానాల్లో సర్‌ప్లస్ టీచర్లను సర్దుబాటు చేయాలన్నారు. యాప్‌ల భారాన్ని తగ్గించాలని కోరారు. నాడు-నేడు, జేవీకే, టాయిలెట్ మెయింటెనెన్స్ పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రతాప్ రెడ్డి, మధు, ప్రభాకర్ రెడ్డి, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీ బలవన్మరణం



హుసేన్ బీ (ఫైల్)

యాడికి: గర్భిణీ బలవన్మరణం పొందిన ఘటన మండలంలోని రాయలచెరువు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపిన మేరకు.. నంద్యాల జిల్లా వెల్దుర్తి మండలం రత్నంపల్లె గ్రామానికి చెందిన దస్తగిరి కుమార్తె హుసేన్‌బీ(28)తో యాడికి మండలం రాయల చెరువు గ్రామానికి చెందిన నన్నేసాబాకు 8 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 3 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. హుసేన్‌బీ ప్రస్తుతం మూడు నెలల గర్భిణి. కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఆమె బాధపడుతోంది. ఈ క్రమంలోనే శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో జ్యూస్ తాగుతా తీసుకురమ్మని చెప్పడంతో ఇంటి నుంచి భర్త బయటకు వెళ్లాడు. తిరిగి వచ్చి పలకరిస్తే ఇంటి తలుపులు తీయలేదు. ఇరుగు పొరుగు వారితో కలిసి తలుపు పగులగొట్టి లోపలికి వెళ్లగా హుసేన్ బీ ఉరికి వేలాడుతూ కనిపించింది. కిందికి దింపి చూడగా అప్పటికే ప్రాణాలు విడిచింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కల దాడిలో 18 గొర్రెల మృతి



మృతి చెందిన గొర్రెలు

బ్రహ్మసముద్రం: కుక్కల దాడిలో 18 గొర్రెలు మృతి చెందాయి. మండల పరిధిలోని ఎరడికెర గ్రామంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన దొడ్డక్క గారి పాలక్కకు చెందిన గొర్రెల మందపై కుక్కలు దాడి చేశాయి. 18 గొర్రెలను చంపేశాయి. సమాచారం అందుకున్న మండల పశువైద్యాధికారి డాక్టర్ సూర్యనారాయణ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతి చెందిన గొర్రెల విలువ రూ. 60 వేలకు పైగా ఉంటుందని బాధితులు తెలిపారు.

ఇరు వర్గాల ఘర్షణ : ఆరుగురికి గాయాలు

పెద్దపప్పూరు: పొలం రస్తా విషయమై దాయాదుల మధ్య ఘర్షణ జరిగింది. కట్టెలతో దాడి చేసుకున్నారు. ఈ ఘటన శుక్రవారం ముచ్చుకోట గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన జయసింహారెడ్డి, పెద్దిరెడ్డి నడుమ కొంత కాలంగా రస్తా వివాదం జరుగుతోంది. శుక్రవారం ఇదే విషయమై ఇరు కుటుంబాల వారు గొడవ పడ్డారు. చివరకు కట్టెలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ సంఘటనలో పెద్దిరెడ్డి తండ్రి జయరామి రెడ్డి, సుబ్బారెడ్డికి తలకు తీవ్రగాయాలయ్యాయి. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం తాడిపత్రి ఏరియా ఆసుపత్రికి తరలించారు. జయరామి రెడ్డిని మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఖాజాహుస్సేన్ పేర్కొన్నారు.

రూ.20కే భోజనం

- రైల్వే శాఖ శ్రీకారం
- గుంతకల్లు, రేణిగుంట రైల్వేస్టేషన్లలో ప్రారంభం



గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు భోజనం విక్రయిస్తున్న దృశ్యం

గుంతకల్లు: రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం చవక ధరకు (ఎకానమీ మీల్స్) నాణ్యమైన ఆహారం అందిస్తున్నట్లు డీఆర్ఎం మనీష్ అగర్వాల్ తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద గుంతకల్లు డివిజన్‌లోని గుంతకల్లు, రేణిగుంట రైల్వేస్టేషన్లతోపాటు జోనల్‌లోని హైదరాబాద్, విజయవాడ రైల్వే స్టేషన్లలో అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. రైల్వే ప్రయాణికులకు నాణ్యమైన,పరిశుభ్రమైన భోజనాన్ని సరసమైన ధరలో అందించాలనే ఉద్దేశంతో భారతీయ రైల్వే ఎకానమీ మీల్స్ అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు.ముఖ్యంగా జనరల్ కోచ్‌లో ప్రయాణించే వారికి తక్కువ ధరతో రెండు రకాల భోజనాన్ని అందిస్తామన్నారు. మొదటి రకం ఎకానమీ భోజనం కేవలం రూ.20కు, రెండో రకం కాంబో రూ.50కు లభిస్తుందన్నారు. ఐఆర్‌సీటీసీ రిఫ్రెష్‌మెంట్ రూమ్‌లోని కిచెన్ యూనిట్లు, జన్ ఆహార్ సర్వీస్ కౌంటర్ల ద్వారా ప్రయాణికులకు అందిస్తున్నట్లు ఆయన వివరించారు. జనరల్ కోచ్‌ల సమీపంలోని ప్లాట్‌ఫాంపై సర్వీసు కౌంటర్లు ఉంటాయన్నారు. ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

300 క్వింటాళ్ల సబ్సిడీ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బియ్యం లారీతో అధికారులు

రాప్తాడు: ప్రభుత్వం పేదలకు సబ్సిడీపై అందిస్తున్న బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా దాడి చేసి స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సీఐలు సాయిప్రసాద్, రామారావు తెలిపారు. వారు తెలిపిన వివరాలు.. నంద్యాల జిల్లా బనగానపల్లికి చెందిన శ్రీనివాసా రైస్ మిల్లు యాజమాని శ్రీనివాసులు అలియాస్ డాన్ శీను ఓ లారీలో 300 క్వింటాళ్లను (600 ప్యాకెట్ల 50 కేజీల బియ్యం) కర్ణాటక రాష్ట్రంలోని తుమకూరుకు తరలించే ఏర్పాట్లు చేశారు. విజిలెన్స్ రీజనల్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఈశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు రాప్తాడు మండలం మరూరు టోల్ ప్లాజా సమీపంలో విజిలెన్స్ సీఐలు సాయిప్రసాద్, రామారావు, తహసీల్దార్ లక్ష్మీ నరసింహ, సీఎస్‌డీటీ జ్యోతి వాహనాలు తనిఖీ చేస్తుండగా లారీ అక్కడికి వచ్చింది. అధికారులు అనుమానంతో తనిఖీ చేయగా, 300 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు తెలిసింది. వీటికి ఎలాంటి బిల్లులు లేకపోవడంతో పాటు లారీకి కూడా ఎలాంటి ఆధారాలు లేవు. దీంతో లారీని సీజ్ చేసి అధికారులు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతపురం సివిల్ సప్లయిస్ స్టాక్ పాయింట్‌కు తరలించారు. డ్రైవర్ కాంతారావు, క్లీనర్ శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు.

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

కంబదూరు: ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన ఘటన వైసీ పల్లి-కళ్యాణదుర్గం రహదారిలో చోటుచేసుకుంది. వివరాలు.. వైసీ పల్లికి చెందిన శ్రీనివాసులు (50), మరో ముగ్గురితో కలిసి శుక్రవారం డ్రిప్ పైపులను తీసుకొని ఆటోలో కళ్యాణదుర్గం నుంచి వైసీ పల్లికి బయలుదేరాడు. వైసీ పల్లి సమీపంలో ఒక్కసారిగా ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్రగాయాలైన శ్రీనివాసులు అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య తులసమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై కంబదూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

తాడిపత్రి: రైలు కింద పడి డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. రూరల్ పరిధిలోని పుట్లూరు రోడ్డు రైల్వే లెవల్ క్రాసింగ్ సమీపంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. రైల్వే డీఎస్పీ అబ్దుల్ అజీజ్ తెలిపిన మేరకు.. తాడిపత్రి పట్టణంలోని చేనేత కాలనీకి చెందిన చెన్నా భాస్కర్, భారతి దంపతుల కుమార్తె చెన్నా పావని (22) పట్టణంలోని ఓ ప్రయివేట్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. కొన్ని రోజులుగా కడుపు నొప్పితో ఆమె బాధపడుతోంది. దీంతో సరిగా చదవక పరీక్షల్లో ఫెయిల్ అవుతానేమోనన్న దిగులుతో ఉండేది. ఈ క్రమంలోనే శుక్రవారం ఇంటి నుంచి వెళ్లిన పావని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఖాతాదారుల శ్రేయస్సే లక్ష్యం

- ఎస్‌బీఐ సీజీఎం నవీన్‌చంద్రజ



మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న ఎస్‌బీఐ సీజీఎం నవీన్‌చంద్రజ

అనంతపురం అగ్రికల్చర్: ఖాతాదారుల శ్రేయస్సే లక్ష్యంగా స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిరంతరం పనిచేస్తుందని ఆ బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) నవీన్‌చంద్రజ తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక ఓ ప్రైవేట్ అతిథి గృహంలో సమావేశం నిర్వహించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆర్డీటీ సంస్థకు అంబులెన్స్ కొనుగోలుకు రూ.26.11 లక్షలు అందించారు. స్థానిక తిలక్‌రోడ్డు బ్రాంచి ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు రూ.10 కోట్ల చెక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి తక్కువ వడ్డీరేట్లతో పెద్ద ఎత్తున రుణాలు అందిస్తామన్నారు. అనంతరం ఎస్‌బీఐ అందిస్తున్న రుణాలు, వివిధ సేవల అవగాహన నిమిత్తం నగరంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీజీఎం లేఖామీనన్, ఆర్ఎం రమేష్, ఇతర అధికారులు, బ్రాంచి మేనేజర్లు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.